# రోగానికి తగ్గ మందు

★ శ్రీ డి. కె. ప్రసాద్ ★

ఇతరులను అపహాసించడం ఎంత తేలికో, ఇతరులచేత పరిహాసించకుండా ఉండడం అంతకష్టం.

వెంకట్రావు సరిగ్గా ఇదే బాపతు. అతనిచేత, ఆవూళ్లో విమర్శించబడకుండా ఉన్న వ్యక్తులు చాలా తక్కువ. అలాగే, అతన్ని విమర్శించనివారు చాలా అరుదు. పోనీ, తన వ్యాఖ్యానం, ఎదటివాడి స్థితిని గమనించి అయినా వెలగబెట్టడు. అవును మరి. తన కృష్టమయితేగదా, డేకితే తాటిపట్టె గుచ్చుకుంటుందని భయపడ్డానికి.

ఒకసారి, చుట్టంచూపుగా వచ్చిన మా బావమరది, నేను కలసి బజార్లోకి వెడుతున్నాం. అతను ఓ అడుగు వెనక్కాల ఉన్నాడు. నా యోగం బాగులేక, ఇంతలో వెంకట్రావు ఎదురయ్యాడు. వెనకాల వస్తూన్న మా శ్యాలకుణ్ణి చూసి, "ఎవరోయ్, ఆ పేడిమూతి వ్యక్తి?" అన్నాడు మామూలు ధోరణిలో. నేను నాలిక కొరుక్కున్నాను, "అనొద్దురా!" అని. వాడికా దృష్టే లేదు. అది మా బావమరది చెవిలో పడింది కాబోలు, ఆరాత్రి పడక గదిలో, రాణీగారు, నేను—నా స్నేహితుడిచేత వాళ్ళతమ్ముణ్ణి ఆక్షేపింప జేశానని దావా తెచ్చింది. రాజీకివచ్చేసరికి తలప్రాణం తోకకొచ్చింది.

పోనీ, యితరులను యింత విమర్శించేవాడు, తనింట్లో ఎవరైనా అటాడేమో అంటే, అలాంటిది తను చెయ్యడు, ఇతరులను చెయ్యనివ్వడు.

ఓ రోజున నలుగురైదుగురు మిత్రులు వెంకట్రావు యింట్లో కూర్చుని బాతాఖానీ కొడుతున్నాం. ఇంతలో గేదిదూడ అక్కడికి వచ్చింది. దానికో కాలు కొంచం కుంటిది దాన్ని చూచి, ఒక మిత్రుడు, "ఎవరిదో ఆ త్రిపాదజంతువు?" అన్నాడు. ఆపళంగా వెంకట్రావు అందుకుని, అది కుంటడం కాదనిన్నీ, దానికి అలా నడవడం సరదా, పైగా అలవాటుకూడాననిన్నీ సమర్థించాడు. పైగా కొద్దో గొప్పో పందెంకూడా వేయడానికి సిద్ధపడ్డాడు. వాణ్ణి ఆ విషయం లోంచి ఏ పట్టాన తప్పించలేకపోయాం.

అందులో ఆడవాళ్ళని, ముఖ్యంగా ఫేషనబుల్ గా తయారయి, హుషారుగావున్న యువతులనుచూచి మావాడు విసరే విసుర్లు వాళ్ళు వినివుంటే, వెంటనే కోర్టులో పరువునష్టానికి దావా తెచ్చేవాళ్ళే. ఒకొక్కసారి ఆమాటలు వింటే—మనకే కష్టమనిపిస్తుంది.

ఒకరోజున మేమంతా పార్కులో నడుస్తున్నాం. మాకు కొన్ని గజాలు ముందుగా ఒక స్త్రీ, పురుషుడు వెడుతున్నారు. ఆ పై లక్షణాలే చెబుతున్నాయి బాగా డబ్బున్నవారని. అంతేనండి. దాంతో మావాడు "ఆలిండియా రేడియో" వార్తల్లాగ ప్రారంభించాడు, తన ఉపన్యాసాన్ని.

"అబ్బాయి, డబ్బున్నంత మాత్రాన ఆడదాన్ని వెంటేసుకుని పబ్లిక్కు పార్కుల్లో తిరగడం మన సమాజానికి తగదోయ్. ఎంత స్వంత భార్యయినా అలాగ ఊరేగడమా? మనకీ భార్యలు లేరా? మన 'మలాగే తిరుగుతున్నామా? ఎటొచ్చి, ఈ డబ్బున్నవాళ్ళకే ఈ వ్యాధి! పైగా మరో తమాషా. అరువో,

స్వంతమో కూడా తెలియదు." అని తన హాస్యానికి తనే నవ్వేశాడు. మేం ముందుకు సాగిపోతున్నాం. క్రమంగా వాళ్ళనిదాటి పోయాం. ఇంతలో, వారిద్దరిలో మగవ్యక్తి.

"అమ్మా, నాన్నగారు వచ్చేవేళయింది. వెళ్ళిపోదామా?" అన్నాడు.

"అయితే వెళ్ళిపోదాం, నడు అబ్బాయి" అని వెనక్కు తిరిగింది. వారిముఖాల్లో ఆ వయస్సు తేడా కనిపిస్తోనేవుంది. మా వాడిముఖాన తెల్ల మతాబా వెలిగింది పాపం!

ఇలాంటి విమర్శనలు వాణ్ణేకాక, వాడితో తిరిగే మమ్మల్నికూడా ప్రమాదావస్థలోకి తెచ్చేటట్టున్నాయి. ఎలాగైనా, ఆ వ్యాధిని కుదర్చాలని, వాడి పరోక్షంలో మేం ఓ నిర్ణయానికొచ్చాం ఆ భావం మా వాళ్ళంతా కలిసి నామీద పడేశారు. కనీసం వెంకట్రావు క్షేమం గురించి అయినా, నేను 'సరే' ననవలసివచ్చింది.

వారం గడిచింది. మా వాళ్లు చాలా ఆదుర్దాగాఉన్నారు, ఎలా ఆ వ్యాధి కుదురుతుందా అని.

ఒకరోజున మా మిత్రులు పార్కులో కబుర్లు చెప్పుకుంటున్నారు వెంకట్రావుకూడా ఆ మందలో వున్నాడు కనుచీకటి పడుతోంది. నేను ఆ సమయానికి వెళ్ళి పనుందని, వాళ్ళందరిని మా యింటివేపు తోలుకొచ్చాను. మేమంతా మా గుమ్మం సమీపిస్తున్నాం. ఎదుటి వ్యక్తి స్పష్టంగా కనపడనంత చీకటి వ్యాపించింది ఆ సమయంలో, ఒకయువతి తెల్లటి చీర కట్టుకుని, తలలో అర్ధచంద్రాకారంగా మల్లెపువ్వులు పెట్టుకుని, వంటరిగా వెళుతూంది. వెంకట్రావు దృష్టి అటు మళ్ళింది. రేడియో విప్పేడు.

"అబ్బాయి, ఆడది అసలు వంటరిగా బయలుదేరనే కూడదు. అందులో చక్కగా అలంకరించుకుని, ఆపైన వెనకాలవాళ్ళని పిలుస్తున్నట్లుగా తల్లో చక్కగా పువ్వులు పెట్టుకుని అసలే పనికిరాదు. పైగా ఈ కనుచీకట్లో! నిజానికి నా ఉద్దేశ్యంలో, రకంవారి సరుకు అయితేనే గాని అలా బయలుదేరదని." పరస్త్రీని గురించి మంచి చెడ్డలు తెలుసుకోకుండా, అలా నిందాపూర్వకంగా మాట్లాడినవాణ్ణి ఏమనాలో తెలియక, మేం ఒకరిమొహం ఒకళ్ళం చూసుకున్నాం. వెంకట్రావుమాత్రం గర్వంగా అడుగులేస్తూ, నడుస్తున్నాడు.

నేను గబగబా మా యింటి గుమ్మమెక్కి- గుమ్మంలో నిలబడ్డ మా ఆవిడ శాంతని, ఎవరే ఆ వెడుతూన్న ఆవిడ?" అని గట్టిగానే అడిగేను. గుమ్మంలో నిలబడ్డ శాంతకు తెలియకపోతుందా అని. జవాబుకోసం అందరూ చెవులు రిక్కించుకుని వింటున్నారు. అందుకు జవాబుగా, శాంత గట్టిగానే, "ఎవ — లేదు, వెంకట్రావుగారి భార్య. పనుండి ఓసారి రమ్మనమని కబురంపితే వచ్చింది. ఏం?" అని మా బృందాన్ని చూచి, లోపలికి వెళ్ళిపోయింది. మా ఆవిడ జవాబు వెంకట్రావు చెవిలో పడే వుంటుంది. లేకపోతే, ఎందుకు పరిగెడుతాడు ఆమె వెనకాల. అంతే ఆవేళ మళ్ళా మా కళ్ళ పడలేదు. మొహం చెల్లలేదు పాపం!

మళ్ళీ, మర్నాడు పార్కులో--

"ఏరా, వెంకట్రావ్, నిన్న మళ్ళా రాలేదేం? అంత విమర్శించి, ఆమె వెనకాల పరిగెత్తావేం? ఇంతకూ ఎవరావిడ?" అని ఒక మిత్రుడు అడిగి మమ్మల్ని చూచి, కన్ను గిలికేడు.

"నోరు మూయవోయ్, సంతోషించాం తెలివి తేటలకి" అన్నాడు తీవ్రంగా.

అంతే! తగినమందు పడగానే, నాటికీ నేటికీ ఆ వ్యాధి లక్షణాలు మళ్ళీ కనబడలేదు.

నేను, శాంతా కలసి చేసిన వైద్యం బాగానే పనిచేసిందన్నమాట!